
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్ 3

జిల్లాల వార్తలు

శనివారం 12 జూలై 2025

నాటు.. నాటు..

బర్డ్‌ఫ్లూతో దెబ్బతో పౌల్ట్రీఫాంల కుదేలు

నాటు కోళ్లతో పెంపకంతో సరికొత్త దారి

ఫారంలో కాకుండా బయట పెంపకం

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం

సోనాలి రకానికి మార్కెట్‌లో డిమాండ్



5



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్

గృహ నిర్మాణ వేగం పెంచాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నిజాంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్, నగరం గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. మండలంలో 357 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 218 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఫ్రైడే-డ్రైడే అమలును పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రామాయంపేటలో..

రామాయంపేట: ఫ్రైడే-డ్రైడేలో భాగంగా శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ రామాయంపేట మున్సిపాలిటీ 7వ వార్డులో పర్యటించారు. మురుగు కాల్వలు, ఇళ్ల బయట నీటి కుండీలను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, మురుగు కాల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని అధికారులకు సూచించారు.



కుంట మరమ్మతుకు కదలిన రైతులు

మాసాయిపేట మండలం అక్కంపేటలో 80 ఎకరాల ఆయకట్టు ఉన్న మల్లుకుంట మరమ్మతుకు శుక్రవారం రైతులు నడుం బిగించారు. అదికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో తామే స్వయంగా రంగంలోకి దిగి శుభ్రం చేశారు.

-మాసాయిపేట (ఆంధ్రజ్యోతి)

అవినీతికి అడ్డా..

అధికారులకు ఏటీఎం!

న్యాల్‌కల్ మండల ఆర్ఐగా పనిచేసిన దుర్గయ్య 2024 జూలైలో ఏసీబీకి పట్టుబడ్డాడు. గణేష్‌పూర్‌కు చెందిన మల్లప్పకు సంబంధించిన వ్యవసాయ భూమిపై కేసులున్నాయని, 'నిమ్జ్' పరిహారం డబ్బులు రావాలంటే తాను అనుకూలంగా నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని నమ్మించాడు. ఇందుకోసం డబ్బు డిమాండ్ చేశాడు. రైతు నుంచి రూ.70వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు.

హుసెల్లీ గ్రామానికి చెందిన ఓ రైతుకు పరిహారం త్వరగా వచ్చేలా చూస్తామని డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు 2025 జూలై 10న డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్యను పట్టుకున్నారు. అధికారులు రైతును రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో రూ.65 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు.

కాసులు కురిపిస్తున్న 'నిమ్జ్'

అడుగడుగునా అక్రమాలు

ఏసీబీ దాడులతో విస్తుపోయే నిజాలు

ప్రహసనంగా భూసేకరణ

లక్ష్యం 12,635 ఎకరాలు..

పదేళ్లలో సేకరించింది 7వేల ఎకరాలు

జహీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో పోస్టింగ్ అంటే అధికారులకు కాసులు కురిపించే ఏటీఎంలా మారింది. ఒకసారి ఇక్కడ పనిచేస్తే.. ఆ తరువాత మరో చోటికి బదిలీ చేసినా.. చక్రం తిప్పి వెంటనే వెనక్కి వస్తున్నారని ఆరోపణలున్నాయి. కొత్తగా ఇక్కడ పోస్టింగ్ రావాలంటే పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి ఉంటుందని చెప్పుకుంటున్నారు. అడిగినంత ముట్టజెపితేనే జహీరాబాద్‌లో పోస్టింగ్ దొరుకుతుంది. మాముళ్లు ఇచ్చి ఇక్కడికి వచ్చినవారు సంపాదించడం పైనే దృష్టిపెడుతున్నారు. ఏ శాఖ కార్యాలయానికి వచ్చే ప్రజలను పలుకరించినా డబ్బు ఇవ్వందే పని జరడం లేదని వాపోతున్నారు. డబ్బు ఉన్నవారు ఎలాగోలా పనులు చేసుకుంటున్నా పేదలు ఇబ్బందులు పడాల్సివస్తోందని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 'నిమ్జ్' భూసేకరణతో సంబంధం ఉన్న శాఖల్లో అవినీతి బహిరంగ రహస్యంగా మారిందని చెప్పుకుంటున్నారు. అడిగినంత ఇస్తేనే బాధితులకు పరిహారం అందుతుంది... లేదంటే కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిప్పుకుంటున్నారు. దీంతో భూ సేకరణ ప్రక్రియ ప్రహసనంలా మారింది. నిమ్జ్ కోసం వివిధ మండలాల్లో 12,635 ఎకరాలు సేకరించాలని నిర్ణయించగా.. పదేళ్లలో 7వేల ఎకరాలు మాత్రమే సేకరించారు.



నత్తనడకన భూసేకరణ

ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యూఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకోసం ఆయా మండలాల్లోని 17 గ్రామాల్లో 7,045 మంది రైతుల నుంచి 12,635 ఎకరాల భూమిని సేకరించాలని గుర్తించారు. 2016-17 నుంచి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 7వేల ఎకరాల భూసేకరణను చేపట్టారు. ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల పరిధిలోని చీలపల్లి (585.04), ఎల్గోయి(1,838.32), బర్దీపూర్(319.05), న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ (310.10), ముంగి(445.22), గంగ్వార్ (38.17),మల్కన్‌పాడ్ (216.05), బసంతాపూర్(248.11), గణేష్‌పూర్(597.39), హుసెళ్ళీ (731.29), గుంజెట్టి(291.33), హద్నూర్(577.29), న్యామ్తాబాద్ (1,221.10),మామిడిగి(1,487), కల్‌బేమల్(415.16),మెటల్‌కుంట(658.27), రేజింతల్(1,734.34) ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. కానీ, ఏ గ్రామంలోనూ పూర్తిగా భూ సేకరణ చేసిన దాఖాలు లేవు. మరో ఏడాదిలో భూసేకరణ పూర్తవతుందని అధికారులు చెబుతున్నప్పటికీ సాధ్యమయ్యేలా

మిగతా 6వ పేజీలో

రికార్డుల్లో రెండెకరాలు..

నిమ్జ్‌లో ఒకటిన్నర ఎకరాలే!

బర్దీపూర్ గ్రామంలోని 16/అ17/1 సర్వే నంబరులో రెండెకరాల భూమిని ప్రభుత్వం మా కుటుంబానికి కేటాయించింది. భూ రికార్డుల్లో రెండెకరాలు అని స్పష్టంగా ఉన్నా.. నిమ్జ్ అధికారులు మాత్రం ఒకటిన్నర ఎకరాలే ఉందని చప్తున్నారు. ఇదేమిటని అడిగితే ఎవరికైనా ఫిర్యాదు చేసుకో.. కావాలంటే కోర్టుకు వెళ్లు అని దురుసుగా సమాధానం ఇస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెండెకరాలకు పరిహారం ఇప్పించాలి.

- పూలమ్మ, బర్దీపూర్



చెక్కులు, రికార్డులు సీజ్

నిమ్జ్ కార్యాలయంపై ఏసీబీ దాడులతో విస్తుపోయే నిజాలు వెల్లడైనట్లు సమాచారం. వివిధ కారణాలను చూపుతూ పెద్ద మొత్తంలో చెక్కులను పెండింగ్‌లో పెట్టారని ఆరోపణలున్నాయి. భూ నిర్వాసితులు అడిగినంత డబ్బు ఇవ్వనందుకే చెక్కులను నిలిపి వేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏసీబీ అధికారులు నిమ్జ్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ రాజీరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, సిబ్బందిని ఏకబిగిన 24 గంటలు విచారించారు. అయితే భూ నిర్వాసితులకు ఇచ్చే పరిహారం డబ్బులను చెక్కుల రూపంలో ఆర్టీజీఎస్ చేస్తున్నారు. తనిఖీల అనంతరం చెక్కులతో పలు రికార్డులను సీజ్ చేసినట్లు సమాచారం. దీంతో శుక్రవారం నిమ్జ్ కార్యాలయం బోసిపోయింది. బాధిత రైతులు వచ్చి వెనుదిరిగి వెళ్లారు.



- ప్రమాదాలకు చెక్.. ప్రయాణం సురక్షితం
- మెదక్ జిల్లా పరిధిలో 58 కిలోమీటర్లు
- ఇప్పటివరకు హైవేపై 800 మంది మృత్యువాత
- ఆలస్యంగానైనా మేల్కొన్న ఎన్‌హెచ్ఏఐ
- నివారణకు చర్యలు

స్మార్ట్‌గా.. హైవే 44

జాతీయ రహదారి విస్తరణ.. అభివృద్ధి

రామాయంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హైటెక్ హంగులతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెదక్ జిల్లాలో జాతీయ రహదారి 44 రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న ఈ రహదారి ఆరు లైన్లుగా విస్తరించనున్నారు. దీంతోపాటు ప్రతీ కిలోమీటరుకో సీసీకెమెరా చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే తెలిసిపోయేలా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించనున్నారు. దీంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడనుంది. జిల్లా పరిధిలో 58 కిలోమీటర్ల హైవేపై ఈ పనులు త్వరలో చేపట్టనున్నారు.

ప్రమాదాల నివారణకు సమగ్ర ప్రణాళిక

హైదరాబాద్-నాగ్‌పూర్ మధ్య ఉన్న 44వ జాతీయ రహదారి మెదక్ జిల్లాలో కాళ్లకల్ నుంచి రామాయంపేట వరకు రామాయంపేట, నార్సింగి, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల పరిధిలో 21 గ్రామాల మీదుగా 58 కిలోమీటర్ల మేర విస్తరించింది. ఈ రహదారిపై ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో 800 మంది వరకు మృత్యువాత పడ్డారు. వేలాది మంది గాయపడ్డారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో, అత్యధిక ప్రమాదాలు జరుగుతున్న రహదారిగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, డిజిటల్ హైవేల ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్-నాగ్‌పూర్ విస్తరణ, ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది.

అత్యాధునిక సౌకర్యాలు

కొత్త హైవేపై ప్రతీ కిలోమీటరుకు ఒకటి, ప్రమాదకరమైన మలుపుల్లో అదనంగా సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు ప్రయాణికుడి వేగాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటాయి. రవాణా మరియు పోలీసు అధికారులకు చేరవేస్తాయి. ఏదైనా దుర్ఘటన జరిగిన వెంటనే అధికారులు అప్రమత్తమై, క్షతగాత్రులకు అత్యవసర రక్షణ కల్పించే అవకాశం ఉంటుంది. ప్రమాద బాధితులకు తక్షణ చికిత్స అందించేందుకు హైవే పొడవునా ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారు. ఈ వ్యవస్థను మానిటరింగ్ చేసే కేంద్రాలు ప్రత్యేక పర్యవేక్షణలో పనిచేస్తాయి. దీంతో ప్రయాణం సులభతరం, సురక్షితం కానుంది. ప్రస్తుతం హైవేలపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతోంది. వివిధ చోట్ల ప్రమాదకరమైన జంక్షన్లు ఉన్నాయి. డిజిటల్ హైవే ఏర్పడితే పట్టణాలు, గ్రామాల నుంచి వెలుపలికి వెళ్లేందుకు అంతటా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేస్తారు. దీంతో నిత్య ప్రమాదాల చింత తీరనుంది.

కలెక్టరేట్ కంపు.. కంపు..

జిల్లా పాలనా కేంద్రంలో దుర్గంధం

నిర్వహణ లోపం..

మరుగుదొడ్లు అధ్వానం

పట్టించుకోని అధికారగణం

మెదక్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆయన జిల్లాకు బాస్.. జిల్లాలో ఏ సమస్య వచ్చినా జనం ఆయన వద్దకే వస్తారు. కానీ, నిత్యం ఆయన విధులు నిర్వర్తించే కలెక్టరేట్‌లోనే సమస్యలున్నాయి. అధికారులకు పట్టింపు లేనితనమో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో కానీ, కలెక్టరేట్ కంపు కొడుతున్నది. ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉందో.. లేదో.. మరి..!

మెదక్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు కంపుకొడుతున్నాయి. ఈ ప్రాంగణంలో సుమారు 45 కార్యాలయాలున్నాయి. డీఆర్‌డీఏ, డీఆర్‌వో, డీఈవో, డీఎంఅండ్‌హెచ్‌వో, ట్రెజరీ, వ్యవసాయశాఖ తదితర శాఖల జిల్లా కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది సందర్శకులు వస్తుంటారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి వందలాది మంది జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించడానికి వస్తుంటారు. కానీ, అక్కడి మరుగుదొడ్ల స్థితిని చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. యూరినల్స్ గొట్టాలు ఊడిపోయినా మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో మురుగు నిండిపోయి మరుగుదొడ్డిలో అడుగు వేయడానికే జంకే పరిస్థితి. టాయిలెట్ కమోడ్‌ల పైకప్పులు ఊడిపోయాయి. వాటర్ గన్స్ చెడిపోయాయి.



కలెక్టరేట్‌లో కంపుకొడుతున్న టాయిలెట్లు

సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే వర్షాకాలంలో అపరిశుభ్రత వల్ల రోగాలు వ్యాపించే అవకాశం ఉందని జనాలు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిపాలనకు ప్రతినిధిగా ఉన్న కేంద్రం కావడంతో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టికేంద్రీకరించాల్సి ఉంది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలకు కలెక్టరేట్‌కు వచ్చినప్పుడు కలెక్టరేట్ ప్రాంగణం చూసి జిల్లా పరిపాలనపై అభిప్రాయం ఏర్పరుచుకునే అవకాశం ఉంది. శౌచాలయాల నిర్వహణపై స్పెషల్‌డ్రైవ్ చేపట్టి తరచూ అధికారులు పరిశుభ్రతను పర్యవేక్షిస్తే మాత్రమే ఇలాటి దురవస్థలు తలెత్తకుండా ఉంటాయి. వివిధ శాఖల హెచ్‌వోడీల అవసరాలకు ప్రత్యేకంగా నిర్మించుకున్నారు. ప్రజల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. టాయిలెట్ల వసతి ఉండీ లేనట్లే భావించాల్సి వస్తోందని వాపోతున్నారు. శౌచాలయాలను శుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం చూపుతున్న కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యా వాతావరణం అందించాలి

- సీఎస్ఆర్ నిధులు పారదర్శకంగా వినియోగించండి
- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం అందించాల్సిన బాధ్యత సంక్షేమాధికారులదేనని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. హాస్టళ్లలో చేపట్టాల్సిన పనుల వివరాలను తనకు అందజేయాలని సూచించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సీఎస్ఆర్ నిధులు పారదర్శకంగా..

సీఎస్ఆర్ నిధులు పారదర్శకంగా వినియోగించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సీఎస్ఆర్ నిధుల వినియోగానికి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కమిటీ 15 రోజులకోసారి సమావేశమై పనుల పురుగతిపై తనకు నివేదిక అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, మైనార్టీ సంక్షేమాధికారి దేవుజా, సీపీవో బాలశౌరి, డీసీహెచ్‌వో సంగారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రి, డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు

కల్లు డిపోలపై ఎక్సైజ్, పోలీసుల దాడులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

నిజాంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నిజాంపేటతో పాటు పలు గ్రామాల్లో పోలీసు, ఎక్సైజ్ అధికారులు కల్లు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 'కల్లు' తేలేస్తారు.. శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎస్సై రాజేష్, ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్సై విజయ్ సిద్ధార్థ, హరీశ్‌ల నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నస్కల్, రాంపూర్ కల్వకుంట, నార్లాపూర్, నందిగామ తదితర గ్రామాల్లో కల్లు దుకాణాల్లో నమూనాలు సేకరించారు. నిషేధిత రసాయనాలు కలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

మండల పరిషత్‌గా భానూరు

ఇస్నాపూర్‌లో విలీనానికి 'బీడీఎల్' యాజమాన్యం అభ్యంతరం

ఐదుగురు ఎంపీటీసీలతో మండల పరిషత్

రామచంద్రాపురం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొత్త మండల పరిషత్‌గా భానూరును ఏర్పాటు చేయడం ఖరారయ్యింది. ఈ దిశగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూరు, క్యాసారం, నందిగామ, రుద్రారం, లక్డారం గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని రాష్ట్రప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక అందజేశారు. అయితే ఈ ప్రతిపాదనపై బీడీఎల్ పరిశ్రమ అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామాల విలీనాన్ని విరమించుకున్నారు. రుద్రారం, లక్డారం గ్రామాలను మాత్రం ఇస్నాపూర్‌లో కలపనున్నారు. భానూరును మండలంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



ఐదు ఎంపీటీసీ స్థానాలు

భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాల్లో ఐదు ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేయాలని మండల అధికారులు ప్రతిపాదించారు. భానూరులో 9,203, క్యాసారంలో 2,752, నందిగామలో 3,257 జనాభా ఉంది. ప్రతీ మూడు వేల మందికి ఒక ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ లెక్కన భానూరులో మూడు, క్యాసారం, నందిగామ గ్రామాల్లో ఒక్కో ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయనున్నారు. ఒక జడ్పీటీసీ సభ్యుడు ఉంటారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

కుకునూరుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న కేసులో నిందితులను కుకునూరుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 15 గ్రాముల బంగారం, రూ. లక్షా పది వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో తొగుట సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన అన్నా రెడ్డి, మహబూబాబాద్ జిల్లాకు చెందిన కూజా నరసయ్య ఏడాదిగా తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి, రాత్రి వేళ తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. కుకునూరుపల్లి, కొముురవెల్లి, దుబ్బాక, రాయపోల్, చేర్యాల, బెజ్జంకి పోలీసస్టేషన్ల పరిధిలో 19 చోరీ కేసుల్లో వీరు నిందితులు. చోరీ చేసిన తర్వాత వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం వీరి నైజం. ఈ చోరీలను సవాల్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బృందం వీరి ఆచూకీని కనుకొని అరెస్ట్ చేసింది. వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకుంది.



ధ్వంసమైన బ్రిడ్జి సైడ్‌వాల్స్

ఆ ఆరు కిలోమీటర్లు.. నరకయాతన!

రాయికోడ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులకు రాయికోడ్ మండలం షైపతూర్ గ్రామం నుంచి మనూరు మండలం, రాయిపల్లి మంజీరా నదిపై ఉన్న బ్రిడ్జి వరకు గల ఆరు కిలోమీటర్ల రహదారి నరకం చూపుతోంది. గత రెండేళ్లుగా ఈ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై వేసిన కంకర పూర్తిగా తేలిపోయి, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. బ్రిడ్జి ప్రారంభానికి ముందే ఒక వైపు కుంగిపోగా, గతంలో లారీ ఢీకొట్టడంతో బ్రిడ్జి సైడ్ రైలింగ్ ధ్వంసమైంది. కనీసం వాటికి ఎలాంటి మరమ్మతులు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పూర్తిగా దెబ్బతిన్న ఈ రోడ్డు కారణంగా ప్రయాణికులు ఫుల్‌కూర్తి, నారాయణఖేడ్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి, ఈ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

విగ్రహ ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రుద్రారం హనుమాన్ ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం రుద్రారం హనుమాన్ ఆలయం వద్ద హిందూ సంఘాలు, ఎంపీ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. గురువారం రాత్రి హనుమాన్ ఆలయంలో ఓ వ్యక్తి సీసీ కెమెరాలతో పాటు విగ్రహాలన్నింటినీ ధ్వంసం చేయగా, విషయం తెలిసిన గ్రామస్థులు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎంపీ రఘునందన్‌రావు గ్రామానికి చేరుకొని



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందనరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

పరిస్థితిని సమీక్షించారు. మానసిక దివ్యాంగుడనే పోలీసుల వాదనను ఆయన వ్యతిరేకించారు. తెలంగాణలోని పలు ఆలయాల్లో మానసిక దివ్యాంగుల రూపంలోనే విగ్రహాల ధ్వంసం జరుగుతోందని, వీరంతా కర్ణాటక ప్రాంతానికి చెందిన వారే కావటం గమనార్హమని ఆయన అన్నారు. వారి ముసుగులో సంఘ విద్రోహ కార్యక్రమాలకు పాల్పడుతున్న వారి అసలు రూపాన్ని పోలీసులు బయటపెట్టాలని ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్‌ను కోరారు. హిందూ ఆలయాల్లో విగ్రహాల ధ్వంసం చేస్తున్న అదృశ్య శక్తుల భరతం పడతామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భాజపా అధ్యక్షురాలు గోదావరి, బజరంగదళ్ రాష్ట్ర నాయకులు సుభాష్, వీహెచ్‌పీ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీతో పాటు పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ధ్వంసమైన విగ్రహాల స్థానంలో పునఃప్రతిష్ఠ : ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రుద్రారం గ్రామంలో హనుమాన్ ఆలయంలో విగ్రహాల ధ్వంసం దురదృష్టకరమని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రుద్రారం హనుమాన్ గుడి వద్ద ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. ఇది సున్నితమైన అంశం కాబట్టి నిష్పక్షపాతంగా విచారణ కొనసాగించాలని ఆయన పోలీస్ అధికారులను కోరారు. దీనివల్ల రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కూడా గొడవలు జరిగే అవకాశం ఉన్నందున పోలీస్ వ్యవస్థ జాగ్రత్తగా ముందుకు సాగాలన్నారు. ధ్వంసమైన విగ్రహాలను జల నిమజ్జనం చేసి, వాటి స్థానంలో కొత్త విగ్రహాలతో పాటు బలిపీఠం, ఒంటి విగ్రహాలను పునఃప్రతిష్ఠిస్తామని, అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

పరీక్షల భయంతో ఫినాయిల్ తాగి.. గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

సిద్దిపేట కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పరీక్షల భయంతో గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట కేసీఆర్ నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో రిషిక్ పదవ తరగతి చదువుతున్నాడు. రిషిక్ పరీక్షలంటే భయం. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రిషిక్ వసతి గృహంలో కనిపించిన ఫినాయిల్ తాగాడు. గమనించిన తోటి విద్యార్థులు వసతి గృహ బాధ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేయాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చాయో చెప్పాలంటూ బీఆర్‌ఎస్వీ నాయకులు వసతిగృహం వద్ద ఆందోళనకు దిగారు. ఆర్డీవో సదానందం వచ్చి, విద్యార్థి సంఘ నాయకులతో మాట్లాడారు. సంఘటనపై పూర్తి విచారణ చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కలెక్టర్ హైమావతి పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏసీపీ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో భయపడి.. జీపీ కిటికీకి ఉరేసుకున్న యువకుడు



గరీబ్ (ఫైల్)

రాయికోడ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ స్టార్ట్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడంతో భయపడిన ఓ యువకుడు పంచాయతీ కార్యాలయ కిటికీకే ఉరి వేసుకున్నాడు. మండల పరిధి హస్నాబాద్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. వట్‌పల్లి మండలం మర్వెల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం మండల పరిధిలోని హస్నాబాద్‌లోని వారి అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. తల్లీచెల్లెలితో కలిసి ఆ గ్రామానికి వచ్చి ఉంటున్న గరీబ్ (24) గురువారం రాత్రి గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. శుక్రవారం ఉదయం గ్రామస్థులు, ట్రాక్టర్ డ్రైవర్ అశోక్ దేవిదాసులు కలిసి వచ్చి ట్రాక్టర్ ఎందుకు స్టార్ట్ చేశావని గరీబ్‌ను నిలదీశారు. గ్రామపంచాయతీ తాళాలు పగులగొట్టి ట్రాక్టర్ స్టార్ట్ చేసినందుకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పి, వెళ్లిపోయారు. భయపడిన గరీబ్ గ్రామపంచాయతీ కార్యాలయ కిటికీకే ఉరి వేసుకున్నాడు. అతని సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి కూలీ మృతి

చిన్నకోడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిన ఓ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని విఠలాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సైఫ్‌అలీ కథనం ప్రకారం.. విఠలాపూర్‌కు చెందిన మేకల రవి (45) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం గ్రామంలోని ఓ వ్యక్తి వ్యవసాయ బావి వద్ద చెట్లు కోయడానికి గ్రామానికి చెందిన మరికొంత మంది కూలీలతో కలిసి వెళ్లాడు. బావిని అనుకోని ఉన్న చెట్లను రవి మిషన్‌తో కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. దీంతో అతని తలకు, మెడ కింది భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై, ఫైర్ సిబ్బంది వచ్చి తాళ్ల సహాయంతో రవిని బావి నుంచి తీశారు. ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రవి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శాంతవ్వ, కుమారుడు, కూతురు ఉన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

రామచంద్రాపురం టౌన్ జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇనుపచువ్వలు ఏరుకుంటూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్న ఓ మహిళ మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గోపరాజు కథనం ప్రకారం.. రామచంద్రాపురం కానుకుంట ఎస్‌ఎన్‌రెడ్డి ఫంక్షన్‌హాలు ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఈశ్వరమ్మ (50) అనే మహిళ ఇనుపచువ్వలు ఏరుకుంటూ స్క్రాప్ దుకాణంలో అమ్మేది. శుక్రవారం ఉదయం ఎలాంటి చలనం లేకుండా ఉండటంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పడికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె కుడి చేతిపై శివ, బాలరాజు, రాజశేఖర్ అనే పేర్లతోపాటు శిలువలను పచ్చబొట్టు ఉంది. స్క్రాప్ దుకాణం యజమాని షాబాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు పీర్లు దగ్ధం

సంగారెడ్డి క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కంది మండలం కాశీపూర్‌లో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పీర్లు దగ్ధమయ్యాయి. ఈనెల 8న గ్రామంలో దూల్‌నాల్ సాబ్ పీర్లను దట్టి, పూలతో అలంకరించి రేకుల షెడ్డులో ప్రతిష్ఠించారు. గురువారం అర్ధరాత్రి వరకు గ్రామస్థులు పీర్ల వద్ద ఊదు వేశారు. అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఊదు కారణంగా ప్రమాదవశాత్తు అర్ధరాత్రి తర్వాత పీర్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్, సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతికుమార్, ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్‌లు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టివేత

కోహెడ జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకున్నట్లు కోహెడ ఎస్సై అభిలాష్ తెలిపారు. మండలంలోని వింజపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసమంటూ మూడు బొలెరో వాహనాలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాయి. చిన్నకోడూరు, బెజ్జంకి మండలాలకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి శుక్రవారం వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చౌటకూర్ మండలంలో మట్టిని తరలిస్తున్న టిప్పర్

పుల్‌కల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని శివంపేటలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ అనుదీప్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌లకు నమ్మకమైన సమాచారం రావడంతో గ్రామ శివారు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వి తీసుకువెళ్తున్న టీఎస్35 టీ 1928 నంబరు గల వాహనాన్ని స్వాధీనం చేసుకుని పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


దుబ్బాక మండలంలో ట్రాక్టర్..

దుబ్బాక, జూలై 11(ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి దుబ్బాక మండలం ఆకారం గ్రామ శివారులోని కూడవెల్లి వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందింది. దీంతో పోలీసు సిబ్బందితో కలిసి కూడవెల్లి వాగు వద్దకు వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజ్ తెలిపారు. ట్రాక్టర్‌ను దుబ్బాక పోలీస్‌స్టేషన్‌కు తరలించిన్నట్టు పేర్కొన్నారు.

ప్రారంభోత్సవం నాటికి పగళ్లు

● చెన్నాపూర్ పంచాయతీ భవనం నాసిరకం పనులపై విమర్శలు

శివ్వంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాల్సిన నూతన పంచాయతీ భవనం ప్రారంభానికి ముందే గోడలు బీటలు వారాయి. శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్యే సునీతా రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగ్గా, భవనంలో పగుళ్లు కనిపించాయి. అధికారులు వెంటనే స్పందించి పగుళ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



భవనం గోడలకు ఏర్పడిన పగళ్లు

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

గ్రామాల్లో రాజకీయాలు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, అధికార పార్టీ నాయకులు ఓపికతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్యదర్శులకు బిల్లులు రాక, డీజిల్ డబ్బులు లేక చెత్త ట్రాక్టర్లు తిప్పలేక పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సర్పంచుల, కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ కావడంతో ఎరువులకు కొరత లేకుండా ప్రభుత్వం చూడాలన్నారు. రైతులకు రుణమాఫీ 30 శాతం కూడా కాలేదని, రుణమాఫీ అయిన వారితోపాటు కాని వారి జాబితా కూడా సిద్ధం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 60 గజాల నిబంధనలను తొలగించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఐదు లక్షలు ఇచ్చేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు.

'ఆయిల్‌పామ్'తో అధిక లాభాలు

- మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య
- జిల్లాలో 1200 ఎకరాల్లో సాగు
- ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌సింగ్



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

కొల్చారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితోనే అధిక లాభాలు పొందవచ్చని మెదక్ జడ్పీ సీఈవో సీహెచ్ ఎల్లయ్య అన్నారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో రైతు జగదీష్ రాజలింగం పొలంలో శుక్రవారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని వరి రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని, మొక్కలు, డ్రిప్‌నకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. వరి కంటే ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం వస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా నేలలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని, ఇప్పటివరకు 1200 ఎకరాల్లో సాగుచేశారని తెలిపారు. 2023-24లో 78మంది రైతులు 336 ఎకరాలలో, 2024-25లో 152 మంది రైతులు 533 ఎకరాలలో సాగు చేపట్టారని, ఈ ఏడాది 2500 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే 1545 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 771 ఎకరాలు నాటు వేయడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకొని, అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టి లాభాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం..
పందిరి సాగుతో అధిక లాభాలు

- హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రాజిరెడ్డి


కాకరకాయ పంటను పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్, అదనపు కలెక్టర్

కొండపాక, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల పందిరి సాగుతో రైతులకు అధిక దిగుబడులతోపాటు ఆరోగ్యం లభిస్తుందని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డి.రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం బందారం శివారులో అమ్మన రాజిరెడ్డికి చెందిన 30 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి సందర్శించి, పందిరి సాగు పంటలను పరిశీలించారు. సేంద్రియ పందిరి సాగుతో పండించిన పంటలకు మార్కెటింగ్ ఎలా ఉంటుందని, సంవత్సరానికి ఎకరాకు ఎంత ఆదాయం వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు. సేంద్రియసాగుకు సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం పెంచితే సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతు అధికారులకు తన అభిప్రాయాన్ని తెలిపారు. పశువుల పేడతో తయారయ్యే ఎరువుల ప్లాంటును కూడా వారు పరిశీలించారు. రైతులు లాభసాటి పంటలపై దృష్టి సారించాలని సూచించిన వైస్ చాన్సలర్, కూలీల కొరత ఉన్నప్పటికీ యాంత్రీకరణతో సాగు చేస్తున్న తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి సువర్ణ, మండల అధికారి కౌసల్య, శాస్త్రవేత్తలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


పందిరి సాగు పంటలను పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్ రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

బర్డ్‌ఫ్లూతో కుదేలైన పౌల్ట్రీ రంగానికి నాటు కోళ్ల పెంపకం కొత్త దారి చూపుతోంది. బాయిలర్ కోళ్లతో భారీ నష్టాలు చవిచూసిన రైతులు, ఇప్పుడు నాటు కోళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలానికి చెందిన మన్నె నర్సింగ్‌రావు వంటి రైతులు, ఫారంలో కాకుండా కోళ్లను బయట పెంచుతూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ ఖర్చుతో, సహజమైన పద్దతుల్లో పెంపకం చేపట్టడం ద్వారా అధిక ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో నాటు కోళ్లకు పెరుగుతున్న డిమాండ్, ఈ కొత్త పెంపకం విధానాన్ని విజయవంతం చేస్తోంది.

నాటు నాటు



- బర్డ్‌ఫ్లూతో దెబ్బతో పౌల్ట్రీఫాంల కుదేలు
- నాటు కోళ్లతో పెంపకంతో సరికొత్త దారి
- ఫారంలో కాకుండా బయట పెంపకం
- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- సోనాలి రకానికి మార్కెట్‌లో డిమాండ్

తూప్రాన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బర్డ్‌ఫ్లూ, అంతుచిక్కని వ్యాధితో పౌల్ట్రీఫాంలలో పెంచుతున్న కోళ్లు మరణించాయి. దీంతో బాయిలర్ కోళ్లకు డిమాండ్ తగ్గి, పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంక్షోభం పలువురు రైతులను నాటు కోళ్ల పెంపకంపై దృష్టి సారించేలా చేసింది. మొదట ఐకేపీ మహిళా సంఘాల ద్వారా నెలకు రూ.115 చొప్పున 150 నాటు కోడిపిల్లలను తీసుకుని ఖాళీగా ఉన్న ఫారంలో పెంచడం మొదలుపెట్టారు. కోడిపిల్లలకు ఫారంలో అలవాటు చేసి, ఆ


మధ్యాహ్నం తర్వాత ఫారంలో నాటు కోళ్లు

తర్వాత బయటకు వదలడం ప్రారంభించారు. ఉదయం బయటకు వెళ్లిన కోళ్లు పురుగులు, క్రిములు తిని సాయంత్రానికి తిరిగి ఫారంలోకి వచ్చాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో నాటు కోళ్లను బయట పెంచడం లాభదాయకమని రైతులకు నమ్మకం కలిగింది.

తక్కువ ఖర్చు, అధిక లాభం


నాటు కోళ్ల పెంపకంలో మందులు, దాణా ఖర్చులు చాలా తక్కువ. బాయిలర్ కోడి పిల్లలు దాదాపు రూ.50 వరకు ఉండటంతో పాటు, వాటికి మందులు, భారీగా దాణా అవసరం అవుతుంది. కేవలం 50 రోజుల్లోనే వాటిని విక్రయించాల్సి ఉంటుంది, లేదంటే దాణా ఖర్చులతో నష్టాలు వస్తాయి. నాటు కోళ్ల విషయానికి వస్తే, పిల్లలు తెచ్చిన కొద్దిరోజుల తర్వాత కళ్లలో ఒకసారి మందు వేస్తే సరిపోతుంది. దాణా కూడా తక్కువగా తింటాయి, ఎక్కువ రోజులు ఫారంలో ఉంచినా ఇబ్బందులు ఉండవు.

ఒక్కో నాటుకోడి రూ.500పైనే

మార్కెట్ ధరల విషయానికి వస్తే, బాయిలర్ కోళ్లు కిలో రూ.100కు అమ్ముడుపోతుంటే, నాటు కోళ్లను మూడున్నర నెలలకే కిలో రూ.350 వరకు విక్రయించవచ్చు. ఒక్కో నాటు కోడి రూ.500 నుంచి అంతకంటే ఎక్కువ ధరకు అమ్ముడవుతోంది. నాటు కోళ్లకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండటంతో కొనుగోలుదారులు నేరుగా ఫారం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

సోనాలి రకం పెంపకంపై ఆసక్తి

నాటు కోళ్లలో సోనాలి, కడక్‌నాథ్ రకాలు ప్రధానమైనవి. కాగా, సోనాలి కోళ్లకు ప్రస్తుత మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి పౌల్ట్రీ రైతులు నల్గొండ జిల్లా నుంచి సాధారణ ఒకరోజు కోడిపిల్లలను రూ.32కు, ప్రత్యేకంగా పుంజు (మగ) కోడిపిల్లలను రూ.45 వరకు కొనుగోలు చేస్తున్నారు. సుమారు 20 రోజుల పాటు ఫారంలో పెంచిన తర్వాత, కోళ్లను బయటకు వదలడం మొదలుపెడతారు. ఉదయం 8 గంటలకు బయటకు కోళ్లను విడిచిపెడతారు. అవి గింజలు, పురుగులు తిని మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి ఫారంలోకి వస్తాయి. ఆ తర్వాత వాటికి సాధారణ దాణా వేస్తారు. మూడున్నర నెలల సమయానికి ఒక్కో కోడి కిలోన్నర నుంచి రెండు కిలోల బరువు పెరుగుతుంది. ఈ సమయం నుంచే కోళ్లను విక్రయించడం ప్రారంభించవచ్చు. ఏడాది వరకు అమ్మినప్పటికీ నష్టాలు ఉండవు.


ఫారం నుంచి వదలడంతో బయట తింటున్న నాటు కోళ్లు

నాటు కోళ్ల పెంపకం బాగుంది



పౌల్ట్రీ ఫారంలో నాటు కోళ్ల పెంపకం చాలా బాగుంది. వాటిని సాధారణ కోళ్లలాగే బయటకు వదిలి పెంచుతున్నాం. ఈ పద్ధతి వల్ల కోళ్లకు మంచి డిమాండ్ ఉంది. బాయిలర్ కోళ్లతో పోలిస్తే మందులు, దాణా ఖర్చులు తక్కువగా ఉన్నాయి. ధర కూడా ఎక్కువగా ఉండటంతో పాటు, డిమాండ్ కూడా బాగానే ఉండటం వల్ల ఇది చాలా లాభదాయకంగా ఉంది.

- మన్నె నర్సింగ్‌రావు, నాటుకోళ్ల పెంపకందారు, ఇమాంపూర్

వానాకాలం.. వ్యాధుల గాలం

- వాతావరణ మార్పులతో దోమల విజృంభణ
- పారిశుధ్య లోపంతో జ్వరాలు
- డెంగీ, మలేరియా ముప్పు.. అప్రమత్తతే రక్ష!
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం



కొండపాక, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు సీజనల్ వ్యాధుల విజృంభణకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాలు పడి తగ్గిన తర్వాత, నిలిచి ఉన్న నీటితో దోమల వ్యాప్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం దోమల వృద్ధికి ప్రధాన కారణంగా మారుతోంది. మురుగునీరు నిలిచిపోవడం, పారిశుధ్య లోపం డెంగీ జ్వరాలకు దారితీస్తోంది. ఇప్పటికే కొండపాకకు చెందిన పలువురు సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

జాగ్రత్తలతోనే..

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండటం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు, అధికారులు స్పష్టం చేస్తున్నారు. వర్షాలతో కొత్త నీరు చేరడం, నీటి నిల్వలు పెరగడం వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా, తాగే నీటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాల బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. వర్షాలకు రోడ్లపై ఏర్పడే గుంతలు, వాటిలో నిలిచే నీరు దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు

- ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అతిసార వ్యాధి, ఇతర కడుపు సంబంధిత సమస్యలను నివారించవచ్చు.
- కలుషిత ఆహారం, నీటికి దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. దీనివల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.
- డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా ఉండాలంటే దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇళ్ల చుట్టూ మురుగు గుంతలు లేకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లో ప్రతి వారం ఒక రోజును 'డ్రై డే'గా పాటించి, నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. కూలర్లు, పూల కుండీలు, టైర్లలో ఇతర చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- మనం నివసించే ప్రాంతాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుట్టుపక్కలా ఎక్కడా మురుగు నీరు నిలిచిపోకుండా జాగ్రత్తపడాలి.
- వీలైనంత వరకు తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వాడాలి.

ప్రస్తుతం కేసులు నమోదు కాలేదు



వర్షాకాలంలో దోమలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం మా పీహెచ్‌సీ పరిధిలో డెంగీ, మలేరియా లాంటి తీవ్రమైన కేసులు ఎలాంటివి నమోదు కాలేదు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి జ్వరం, డయేరియా వంటి లక్షణాలు కనిపించినా వెంటనే ప్రాథమిక చికిత్స కోసం రావాలి. అందుకు పీహెచ్‌సీతో పాటు అన్ని సబ్‌సెంటర్లలో మందులు సిద్ధంగా ఉన్నాయి.

- డాక్టర్ శ్రీధర్, కొండపాక పీహెచ్‌సీ వైద్యాధికారి




కోహీర్ కొత్త బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై చేరిన మురుగు నీరు, పని చేయని హైమాస్ట్ లైట్లు

కోరి మున్సిపాలిటీగా మార్పు
అభివృద్ధికి ఏదీ మలుపు?

- సమస్యల సుడిగుండంలో కోహీర్ బల్దియా
- అందుబాటులో లేని అధికారులు
- పనుల కోసం ప్రజలకు తప్పని పడిగాపులు
- అధ్వానంగా మురుగు కాలువలు, రోడ్లపై చెత్త, బురదమయం

కోహీర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చుకుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాదన్న ఆశతో మండల కేంద్రమైన కోహీర్ ప్రజలు గతంలో ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా గ్రామపంచాయతీగా కొనసాగిన సమయంలో గ్రామస్థులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు మండల కేంద్రమైన కోహీర్‌ను ప్రభుత్వం గత జనవరి మాసంలో కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. కానీ అభివృద్ధికి మాత్రం ఇది మలుపు కాలేకపోయింది. ఇక్కడ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఇతర సిబ్బందిని నియమించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. 'పేరుకే మున్సిపాలిటీగా మారి ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా ఉంది'ని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోహీర్ మున్సిపాలిటీ కార్యాలయం

కార్యాలయానికి రాని అధికారులు..

మున్సిపల్ కార్యాలయంలో ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండకపోవడం ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు నిరాశతో వెనుతిరుగుతున్నారు. అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ప్రభుత్వంపై, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మా సమస్యలు పరిష్కరించమని ఫోన్ చేస్తే, ఏకంగా ఫోన్ నంబర్లనే బ్లాక్ చేస్తున్నారు' అని కోహీర్‌కు చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.

కొత్త మున్సిపాలిటీలో సమస్యల తిష్ట

కోహీర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఏ వీధి చూసినా మురుగు కంపు, మురుగునీటి గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయంగా మారాయి. కాలనీల అభివృద్ధిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టణంలోని చాలా చోట్ల వీధిలైట్లు సక్రమంగా లేకపోవడంతో రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే, తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



ప్రజా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలి. కార్యాలయానికి వస్తే ఏ ఒక్క అధికారి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు నిరాశతో వెళ్తున్నారు. ఫోన్ చేస్తే స్పందించకపోవడం సరైన పద్ధతి కాదు. వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలి. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తాం.

- సంపత్‌కుమార్, కోహీర్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



కోహీర్‌లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా, ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించకపోవడం ఒకవంతైతే, అసలు అధికారులు సక్రమంగా కార్యాలయానికి రావడం లేదు. పట్టణంలో సరైన మురుగు కాలువలు లేక, రోడ్లు అధ్వానంగా మారగా, తాగునీరు రాక, వీధి లైట్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు నలుగురు మున్సిపల్ కమిషనర్లు మారారు తప్ప, సమస్యలు మాత్రం ఒక్కటి కూడా పరిష్కరించబడలేదు.

- వాజీద్ జావీ, కోహీర్

గజ్వేల్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సతో తల్లికి ప్రాణ రక్షణ

గజ్వేల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కఠినమైన శస్త్రచికిత్స ద్వారా ఒక తల్లి ప్రాణాన్ని రక్షించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామం వేములఘాట్‌కు చెందిన ఎర్రన్నగారి ప్రవీణకు 13 సంవత్సరాలుగా పిల్లలు లేరు. ఇటీవల ఆమె ఇన్ఫెర్టిలిటీ ద్వారా గర్భం దాల్చగా, విపరీతమైన కడుపునొప్పి రావడంతో ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించారు. గర్భాశయంలో కాకుండా ఫెలోపియన్ ట్యూబ్‌లో పిండం ఉన్నట్లు నిర్ధారించగా, ఇది చాలా కఠినమైన గర్భమని, రక్తహీనత (7 గ్రాములు మాత్రమే రక్తం) కారణంగా హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ విషయమై జిల్లా ఆసుపత్రిని సంప్రదించగా, వైద్యులు స్కానింగ్ చేసి కష్టతరమైనదిగా భావించి డాక్టర్ అన్నపూర్ణ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే శస్త్రచికిత్స చేసి, ఫెలోపియన్ ట్యూబుల నుంచి 500 గ్రాముల రక్తపు గడ్డలను విజయవంతంగా తొలగించారు. తల్లి ప్రాణానికి ఎటువంటి ముప్పు లేకుండా ఆపరేషన్ విజయవంతం చేశామని డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. మరొక ఫెలోపియన్ ట్యూబ్ కూడా బలహీనంగా ఉన్నందున, భవిష్యత్తులో గర్భం వస్తే తల్లికి ప్రమాదమని భావించి, టుబెక్టమి ఆపరేషన్ కూడా చేసినట్లు వివరించారు. ప్రస్తుతం తల్లి ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. ఈ సర్జరీలో డాక్టర్లు అన్నపూర్ణ, ప్రణయరెడ్డి, అనస్తీషియా సూర్య, థియేటర్ అసిస్టెంట్ శ్రీలత పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలో విద్యార్థిని ప్రతిభ

వెల్దుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన కామిక్ అండ్ డ్రాయింగ్ పోటీలో వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. పదవ తరగతి విద్యార్థిని శ్రీకీర్తన మొదటి బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని ఎ. శ్రీకీర్తనను ఎంఈవో యాదగిరి, పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. జిల్లా మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, కమ్యూనిటీ మొబైలైజర్ నవీన, సీఐ మధుసూదన శ్రీకీర్తనకు బహుమతి, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

● చిన్నశంకరంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కామిక్ డ్రాయింగ్ పోటీలలో మిర్జాపల్లి హైస్కూల్ విద్యార్థిని తృతీయ బహుమతి సాధించినట్లు ఎంఈవో పుష్పవేణి తెలిపారు. మెదక్‌లో నిర్వహించిన కామిక్ డ్రాయింగ్ పోటీలలో 9వ తరగతి విద్యార్థిని ఎ. నిఖిత పాల్గొని తృతీయ బహుమతిసాధించింది. నిఖితను ఉపాధ్యాయులు అభినందించారు.

ఖాళీ సీట్ల భర్తీకి నేడు స్పాట్ అడ్మిషన్లు

జిన్నారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిన్నారం ఎస్టీ గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ఎస్టీ గురుకుల కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు తమ అర్హత సర్టిఫికేట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కంపు.. రోగాల ముప్పు

అల్లాదుర్గం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం మండలంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అప్పాజీపల్లి గ్రామంలోని పలు కాలనీల ముందు మురుగునీరు నిలిచిపోయి కంపు కొడుతున్నది. దోమల బెడద ఎక్కువైందని, దీంతో రోగాల ముప్పు పొంచి ఉన్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశిస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, వారి పర్యవేక్షణ లోపంతో పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు నిలిచిన మురుగునీటితో రాకపోకలు కష్టంగా మారాయని, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ఆచరణలో అమలు కావట్లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.


అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లిలోని ఓ కాలనీలో చెరువును తలపిస్తున్న మురుగునీరు

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్


వెల్దుర్తిలో బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

వెల్దుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. శుక్రవారం వెల్దుర్తి రైతు వేదికలో వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదుపై నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డితో కలిసి ఆయన అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని, నూతన ఓటరు నమోదు ప్రక్రియ, మృతి చెందిన ఓటర్ల వివరాలు, వలస ఓటర్లు, ఓటు నమోదులో తప్పిదాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెల్దుర్తి, మాసాయిపేట తహసీల్దార్లు బాలలక్ష్మి, జ్ఞానజ్యోతి, మాస్టర్ ట్రైనర్లు లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్, శివశంకర్, పాండరి, కొండల్, శ్రీనివాస్, ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం శివసాయి రైస్‌మిల్లును తనిఖీ చేసి, సీఎంఆర్ డెలివరీ విషయంలో వేగం పెంచాలన్నారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో..

● చిన్నశంకరంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సవరణతో రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్‌ఐ రాజు, ఓటరు నమోదు శిక్షకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు.


సంగారెడ్డిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జనాభా నియంత్రణ మనందరి బాధ్యత

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణ మనందరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డిలోని జడ్పీ ఆఫీస్ వద్ద అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జనాభా నియంత్రణలో భాగంగా వైద్య సేవలందించిన పలువురు వైద్యులు, సిబ్బందికి క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా. గాయత్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరం

● డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బడి మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరం లాంటిదని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. వచ్చే నెల 12 వరకు అడ్మిషన్ల గడువు ఉందని, జిల్లాలోని అన్ని మండలాల్లోని అధ్యయన కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి, సీఎంవో వెంకటేశం, ఏఎంవో బాలయ్య, అధికారులు పాల్గొన్నారు.


ఓపెన్ స్కూల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

గురుకుల పాఠశాలల భవనాలకు భూమి కేటాయింపు

● తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో నిర్వహిస్తున్న మూడు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణానికి భూమిని కేటాయించినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో నిర్వహిస్తున్న వెల్దుర్తి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. గురుకులంలో విద్యా, వసతి, ఆరోగ్యం, పారిశుధ్య సదుపాయాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతర్‌పల్లి శివారులోని ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న గురుకులానికి తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని సర్వే నంబర్ 14లో 10 ఎకరాలు, పోతరాజుపల్లిలో నిర్వహిస్తున్న వెల్దుర్తి గురుకులానికి వెల్దుర్తిలోని సర్వే నంబర్ 1231లో 10 ఎకరాల భూమి, రావెల్లి శివారులో నిర్వహిస్తున్న నర్సాపూర్ గురుకులానికి నర్సాపూర్ మండలం జక్కపల్లి శివారులోని సర్వే నంబర్ 620లో 10ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదేశాలతో భూమిని కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందన తదితరులు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. దాతల సహకారంతో మెదక్ న్యూ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్పీ ప్రారంభించారు. నేర పరిశోధనకు, ప్రజల భద్రతను మెరుగుపరచడానికి సీసీ కెమెరాలు అవసరమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డిపో మేనేజర్ సురేఖ, పట్టణ సీఐ మహేష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో పుట్‌బోర్డు ప్రయాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని ఎస్పీ సూచించారు.


టేక్మాల్‌లో మొక్కలు నాటుతున్న ఫారెస్టు అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● పెద్దశంకరంపేట ఫారెస్టు రేంజ్ అధికారి వికాస్

టేక్మాల్/పెద్దశంకరంపేట/హవేళిఘణపూర్/నర్సాపూర్/ కొల్చారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పెద్దశంకరంపేట ఫారెస్టు రేంజ్ అధికారి వికాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో టేక్మాల్ ఫారెస్టు బీట్ అధికారి అంజార్, పాఠశాల వార్డెన్ యదయ్య, పాఠశాల సిబ్బంది ఉన్నారు. పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పేట మండల విద్యాధికారి వెంకటేశం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దిరాములు, విద్యార్థులు పాల్గొన్నారు. హవేళిఘణపూర్ మండలంలోని ముత్తాయిపల్లి గ్రామ శివారులో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వేను రెడ్డి, సిబ్బంది ప్రియాంక, వాచర్లు శ్రీను, రమేష్ తదితరులున్నారు. నర్సాపూర్‌లో అటవీశాఖ, విష్ణుఫార్మసీ కాలేజీ సంయుక్తంగా కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎఫ్ఆర్‌వో అరవింద్, కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌తో పాటు అటవీశాఖ అధికారులు, సిబ్బంది, కాలేజీ ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు. కొల్చారం, మండలం వరిగుంతం గ్రామంలో ఏడీఐ అర్చన, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

పీఆర్టీయూ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్


శ్రీనివాస్

పాపన్నపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా తాళ్ల శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా గత అధ్యక్షుని సభ్యత్వం రద్దు చేసినందున, జిల్లా అసోసియేట్ అధ్యక్షునిగా ఉన్న తాళ్ల శ్రీనివాస్‌ను అడ్హాక్ పద్ధతిన జిల్లా అధ్యక్షునిగా నియమించినట్లు వివరించారు. శ్రీనివాస్ పాపన్నపేట మండలం చీకోడ్ లింగాయపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

రామచంద్రాపురం టౌన్ జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు నగదు పురస్కారం నిమిత్తం నిధులను మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. భూమి, ఆకాశం ఆర్ఫనేజ్ ట్రస్టు సహకారంతో ఎంఈవో పీపీ రాథోడ్, ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డికి చెక్కులు అందజేశారు. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గవ్యాప్తంగా పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 46 మంది ప్రభుత్వ బడుల విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

శివ్వంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల పరిధిలోని పాంబండ గ్రామస్థులు ఆందోళన చేశారు. పలు వార్డులకు మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. మూడు, నాలుగో వార్డులలో మోటర్లు కాలిపోయి రోజులు గడుస్తున్నా రిపేరు చేయించడం లేదన్నారు. మూడో వార్డులో బోరు నుంచి కలుషిత నీళ్లు వస్తున్నాయని, పంట పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డిని సంప్రదించగా, మూడో వార్డులో సింగిల్ ఫేస్ మోటార్ కాలిపోయిందని, మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.





గోరింటాకు సంబరాలు



వెల్దుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని హస్తాల్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గోరింటాకు సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు గోరింటాకు పెట్టుకుని సంబరాలు జరుపుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, ప్రణీత, భాగ్యలక్ష్మి, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే, జిల్లా పరిశీలకుడు టీ.రామ్మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. శుక్రవారం అమీన్‌పూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ పదవుల భర్తీలో వార్డు, గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలను పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాను చాటాలన్నారు. సమావేశంలో కో అబ్జర్వర్ దయాకర్, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అవినీతికి అడ్డా.. అధికారులకు ఏటీఎం!

(5వ పేజీ తరువాయి)

కనిపించడం లేదు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.15లక్షల చొప్పున అధికారులు పరిహారం అందజేస్తున్నారు. భూములను ఇవ్వబోమని స్పష్టం చేస్తున్నవారి పరిహారాన్ని న్యాయస్థానంలో జమ చేయనున్నట్లు నిమ్జ్ అధికారులు పేర్కొంటున్నారు. పరిహారం ఇచ్చేందుకు అధికాఉలు పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అడిగినంత ఇవ్వకపోతే ఏవో కొర్రీలు పెడుతూ చెక్కులను నిలిపేస్తున్నారు. ఏసీబీ దాడుల్లో ఉన్నతాధికారులు పట్టడమే ఇందుకు నిదర్శనమని రైతులు వాపోతున్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్ మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావుకు సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తప్పుదోవ పట్టించేయత్నం చేస్తున్నారన్నారు.

ఆరుతడి పంటలు వేయండి

● వ్యవసాయ శాస్త్రవేత్త శోభ

నర్సాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి శాస్త్రవేత్త శోభ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూన్ మాసంలో కేవలం 15 మిమీ, జూలైలో ఇప్పటివరకు 88 మిమీ వర్షం మాత్రమే పడి తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులలో వరి పంటకు కావాల్సిన నీరు అందడం కష్టమన్నారు. రైతులు ఇతర ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపడం చాలా మంచిదన్నారు. వరికి బదులుగా ఈ నెలలో పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, జొన్న, కొర్ర వేసుకోవచ్చని సూచించారు. రైతులు పూర్తి సమాచారం కావాలంటే 9963468360 ద్వారా సంప్రదించాలని వివరిస్తామని పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎంకు చక్కటి స్పందన


ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్టీసీ డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి శుక్రవారం చక్కటి స్పందన లభించింది. పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి ఆయా ప్రాంతాలకు బస్సులు నడపాలని కోరారు. ఆయా సమస్యలను నమోదు చేసుకున్న స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా బస్సులను ఆదరిస్తే మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి అవకాశం ఉంటుందని డీఎం అన్నారు.

పంట పొలాలకు బాటను చూపాలని వినతి

చిన్నశంకరంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామ శివారు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు బాటను చూపాలని రైతులు శుక్రవారం తహసీల్దార్ మాలతికి వినతి పత్రాన్ని అందజేశారు. పంట పొలాలకు దారి లేకుండా బాటకు అడ్డంగా ఓ రియల్టర్ అడ్డు గోడను ఏర్పాటు చేసి బాటపై వెళ్లకుండా చేశాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్టర్‌పై చర్యలు తీసుకొని అడ్డు గోడను తొలగించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె పంట పొలాల వద్దకు వెళ్లి విచారించిన అనంతరం న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు లింగం గౌడ్, శంకర్, స్వామి, సిద్దిరాములు, రాజు, రాజయ్య, సోచయ్య, కిష్టయ్య, నర్సింహులు, నారాయణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

జిన్నారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలు చేపట్టారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధి అల్లీనగర్ శివారులో కొందరు అసైన్డ్ భూమిలో నిర్మాణాలు జరుపుతున్నారని నాయకులు బాలయ్య, స్థానికులు శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యావరణ ప్రేమికుడు జ్ఞానేశ్వర్‌కు వజ్ర పురస్కారం

నాగల్‌గిద్ద, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు పాలడుగు జ్ఞానేశ్వర్‌కు వజ్ర పురస్కారం లభించింది. గత పది సంవత్సరాల నుంచి పర్యావరణ రంగంలో చేస్తున్న విశేష కృషికి గాను పర్యావరణ రహిత కార్యక్రమాలను గుర్తించి శనివారం సిద్దిపేటలో వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, యోగా గురువు తోట సతీష్‌ల చేతుల మీదుగా వజ్ర పురస్కారం అందుకున్నారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు.

అందుబాటులో ఆరోగ్యశ్రీ సేవలు


● సన్‌రోహి ఆస్పత్రి వైద్యుడు రవీందర్‌పాటిల్

జహీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడాది క్రితం ఏర్పాటుచేసిన సన్‌రోహి ప్రైవేటు ఆస్పత్రిలో త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆస్పత్రి వైద్యులు డా. రవీందర్‌పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 50 పడకలతో ఏర్పాటుచేసిన ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం అన్ని రకాల సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నాగలక్ష్మి, సంజీవ్‌కుమార్, దిగంబర్, సంజీవరెడ్డి, శ్రీకాంత రెడ్డి, జనార్ధన, సోహెబ్‌అత్తర్, ఉమారాణి, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, అమాయ్‌తప్లేకర్, తేజస్విని, ఓవైస్, నజీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయండి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో 80 వేల జనాభా ఉందని, రాబోయే పది సంవత్సరాల కాలంలో జనాభా లక్షా 50 వేలకు మించిపోతుందని తెలిపారు. ఇందుకోసం వినియోగదారుల సౌకర్యార్థం పట్టణానికి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు లేఖ రాసినట్లు తెలిపారు. అంతేగాకుండా పట్టణానికి మరో 25 ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

మాజీ జెడ్పీటీసీ కన్నుమూత


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

అల్లాదుర్గం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం మాజీ జెడ్పీటీసీ సభ్యులు కౌకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి (58) అనారోగ్యంతో గురువారం రాత్రి కన్నుమూశారు. మండలంలోని ముస్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి సొసైటీ చైర్మన్‌గా, జెడ్పీటీసీ సభ్యుడిగా మండల ప్రజలకు సేవలందించి చక్కటి గుర్తింపును తెచ్చుకున్నారు. శుక్రవారం ముస్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆయన అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. శ్రీనివాస్‌రెడ్డి మృతిపై పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.